रजिस्ट्री सं डी—२२१
Registered No. D-221
రిజిస్ట్రీ నెంబరు డి—221

मूल्य रु 5.00 पैसे
[Price Rs. 5.00 Paise.
మూల్యము : రూ. 5.00 పైసలు

भारत का राजपत्र
The Gazette of India
భారత రాజపత్రము

असाधारण
EXTRAORDINARY
అసాధారణ

भाग XVI अनुभाग 1
Part XVI Section 1
భాగము XVI అనుభాగము 1

प्राधिकार से प्रकाशित
PUBLISHED BY AUTHORITY
ప్రాధికారము ద్వారా ప్రచురింపబడినది

| | | | | | |
|---|---|---|---|---|---|
| स १. | नई दिल्ली | बुधवार | ९ अप्रैल, २०१४/११ | चैत्र | खंण्ड २३ |
| **No.1** | **New Delhi** | **Wednesday** | **9 April, 2014/11** | **Chaitra** | **Vol. 23** |
| సంఖ్య 1 | న్యూఢిల్లీ | బుధవారము | 9 ఏప్రిల్, 2014/11 | చైత్ర | సంపుటము 23 |

MINISTRY OF LAW AND JUSTICE
(LEGISLATIVE DEPARTMENT)

New Delhi, 22nd March, 2014/Phalguna, 1935 Vijaya.

The Translation in Telugu of the following Acts namely:-

(1) The Land Ports Authority of India Act, 2010 (Act No.31 of 2010), (2) The Clinical Establishments (Registration and Regulation) Act, 2010 (Act No.23 of 2010), (3) The National Green Tribunal Act, 2010 (Act No. 19 of 2010) (4) The Prevention and Control of Infectious and Contagious Diseases in Animals Act, 2009 (Act No.27 of 2009) and (5) The Collection of Statistics Act, 2008 (Act No. 7 of 2009) are hereby published under the authority of the President and shall be deemed to be the Authoritative Text thereof in Telugu under Clause (a) of Section 2 of the Authoritative Text (Central Laws) Act, 1973 (Act 50 of 1973).

# శాసన మరియు న్యాయపాలన మంత్రిత్వ శాఖ

## (శాసన నిర్మాణ విభాగము)

ఈ క్రింది చట్టములు, అనగా,

(1) భారత భూమార్గ ప్రాధికార సంస్థ చట్టము, 2010 (2010లోని 31వ చట్టము), (2) చికిత్సాపరమైన సంస్థల (రిజిస్ట్రీకరణ మరియు క్రమబద్ధీకరణ) చట్టము, 2010 (2010లోని 23వ చట్టము), (3) జాతీయ హరిత ట్రిబ్యునలు చట్టము, 2010 (2010లోని 19వ చట్టము) (4) జంతువులలో సాంక్రామిక మరియు అంటువ్యాధుల నివారణ మరియు నియంత్రణ చట్టము, 2009 (2009లోని 27వ చట్టము) మరియు (5) గణాంకముల సేకరణ చట్టము, 2008 (2009లోని 7వ చట్టము) యొక్క తెలుగు అనువాదమును రాష్ట్రపతి ప్రాధికారము క్రింద ఇందుమూలముగా ప్రచురించడమైనది. ఆ చట్టములకు గల ఈ అనువాదమును ప్రాధికృత పాఠముల (కేంద్ర శాసనముల) చట్టము, 1973 (1973లోని 50వ చట్టము) యొక్క 2వ పరిచ్ఛేదములోని ఖండము (ఎ) క్రింద, ప్రాధికృత తెలుగు పాఠములైనట్లు భావించవలెను.

# భారత భూమార్గ ప్రాధికార సంస్థ చట్టము, 2010

## (2010లోని 31వ చట్టము)

[31 ఆగస్టు, 2010]

భారత అంతర్జాతీయ సరిహద్దుల వెంబడి పేర్కొనబడిన ప్రదేశముల వద్ద ప్రయాణీకులను మరియు సరుకులను సరిహద్దును దాటించుట కొరకు భద్రత ఆవశ్యకములను సమకూర్చు నిమిత్తము ప్రదేశ వ్యవస్థలను ఏర్పాటు చేయటానికి మరియు సదుపాయాల అభివృద్ధి మరియు నిర్వహణకుగాను భారత భూమార్గ ప్రాధికార సంస్థను స్థాపించుటకు మరియు అందుకు సంబంధించిన లేదా ఆనుషంగికమైన విషయముల కొరకు నిబంధించుటకైన చట్టము.

భారత గణ రాజ్యపు అరవై ఒకటవ సంవత్సరములో పార్లమెంటుచే ఈ క్రింది విధముగా శాసనము చేయబడినది:-

### అధ్యాయము - 1

### ప్రారంభిక

సంగ్రహనామము మరియు ప్రారంభము.

1.(1) ఈ చట్టమును భారత భూమార్గ ప్రాధికార సంస్థ చట్టము, 2010 అని పేర్కొనవచ్చును.

(2) ఇది, కేంద్ర ప్రభుత్వము అధికారిక రాజపత్రములో అధిసూచన ద్వారా నియతము చేయునట్టి తేదీన* అమలులోనికి వచ్చును, మరియు ఈ చట్టపు వేరు వేరు నిబంధనల కొరకు వేరు వేరు తేదీలను నియతము చేయవచ్చును. మరియు ఈ చట్టము ప్రారంభమును గురించి ఏదేని నిబంధనలోని ఏదేని నిర్దేశమును, అట్టి నిబంధన అమలులోనికి వచ్చునట్లు చేసిన నిర్దేశముగా అన్వయించుకొనవలెను.

నిర్వచనములు.

2. ఈ చట్టములో, సందర్భము ఇతర విధముగా ఉన్ననే తప్ప,-

(ఎ) "ప్రాధికార సంస్థ" అనగా 3వ పరిచ్ఛేదము క్రింద ఏర్పాటు చేయబడిన భారత భూమార్గ ప్రాధికార సంస్థ అని అర్థము;

(బి) "ఛైర్-పర్సన్" అనగా 3వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (3) యొక్క ఖండము (ఎ) క్రింద నియమించబడిన ప్రాధికార సంస్థ యొక్క ఛైర్-పర్సన్ అని అర్థము;

1946లో 31వది.

(సి) "వలస చెక్ పోస్ట్" అనగా విదేశీయుల చట్టము, 1946 క్రింద అధిసూచించ బడిన విధముగా భూమిపై ఏదేని భూమార్గము లేదా బయలుదేరు ప్రదేశము అని అర్థము;

---

* 24-02-2012, ఎస్.ఓ.328 (అసాధారణ), తేదీ 1-3-2012 ద్వారా

(డి) "ఏకీకృత చెక్ పోస్ట్" అనగా కేంద్ర ప్రభుత్వము అధికారిక రాజపత్రములో అధిసూచన ద్వారా నిర్దిష్టపరచునట్టి ఏదేని భూమార్గము అని అర్థము;

(1962లోని 52వది) (ఇ) "భూమార్గ కస్టమ్స్ స్టేషను" అనగా భూమార్గము లేదా అంతర్దేశీయ జల మార్గము ద్వారా దిగుమతి చేయబడిన లేదా ఎగుమతి చేయవలసిన సరుకులకు ఆమోదము నిచ్చే నిమిత్తం కస్టమ్స్ చట్టము, 1962లోని 7వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (1) యొక్క ఖండము (బి) క్రింద కేంద్ర ప్రభుత్వముచే ఆవిధంగా అధిసూచించబడిన ఏదేని ప్రదేశము అని అర్థము;

(1962లోని 52వది) (1946లోని 31వది) (ఎఫ్) "భూమార్గము" అనగా భారత అంతర్జాతీయ సరిహద్దులపై ఒక ప్రాంతము అని అర్థము, ఇందులో కస్టమ్స్ చట్టము, 1962 లేదా విదేశీయుల చట్టము, 1946 క్రింద భూమార్గ కస్టమ్స్ స్టేషను లేదా వలస చెక్ పోస్టుగా అధిసూచించబడిన జాతీయ రహదారులు, రాజ్య రహదారులు మరియు ఇతర రోడ్ల భాగములు చేరియుండును మరియు భారత సరిహద్దుల వెంబడి ప్రయాణీకులు మరియు సరుకుల రవాణాను ఆమోదించడానికి గల సదుపాయములతో కూడిన రైలు మార్గములు ఇందులో చేరియుండును;

(జి) "అధిసూచన" అనగా అధికారిక రాజపత్రములో ప్రచురించబడిన అధిసూచన అని అర్థము;

(హెచ్) "విహిత" అనగా ఈ చట్టము క్రింద చేసిన నియమముల ద్వారా విహితపరచిన అని అర్థము; మరియు

(ఐ) "వినియమములు" అనగా ఈ చట్టము క్రింద ప్రాధికార సంస్థచే చేయబడిన వినియమములు అని అర్థము.

## అధ్యాయము - II
## భారత భూమార్గ ప్రాధికార సంస్థ.

ప్రాధికార సంస్థ ఏర్పాటు. 3.(1) కేంద్ర ప్రభుత్వము అధికారిక రాజపత్రములో అధిసూచన ద్వారా నియతము చేయునట్టి తేదీ నుండి భారత భూమార్గ ప్రాధికార సంస్థ అని పిలువబడు ప్రాధికార సంస్థ నొకదానిని ఏర్పాటు చేయవలెను.

(2) ఆ ప్రాధికార సంస్థ, ఈ చట్టపు నిబంధనలకు లోబడి పైన తెలిపిన పేరుతో శాశ్వత ఉత్తరాధికారము మరియు సామాన్య మొహరును కలిగి నిగమనికాయముగా ఉండి, చర, స్థిరాస్తులను ఆర్జించుటకు, కలిగియుండుటకు మరియు వ్యయనము చేయుటకు మరియు కాంట్రాక్టు కుదుర్చుకొనుటకు హక్కుకలిగి యుండును. సదరు నామముతో అది దావా వేయవచ్చును, మరియు దానిపై దావా వేయబడవచ్చును.

(3) ప్రాధికార సంస్థ ఈ క్రింది వారితో కూడి ఉండవలెను-

(ఎ) ఒక ఛైర్-పర్సన్;

(బి) ఇద్దరు సభ్యులు, వీరిలో ఒక సభ్యుడు (ప్రణాళిక మరియు అభివృద్ధి శాఖ) మరియొక సభ్యుడు (ఆర్థిక శాఖ);

(సి) ఆంతరంగిక వ్యవహారాలు, విదేశీ వ్యవహారాలు, రెవిన్యూ, వాణిజ్యం, రోడ్డు రవాణా మరియు రహదారులు, రైల్వేలు, రక్షణ, వ్యవసాయ మరియు సహకారము మరియు న్యాయ మరియు న్యాయపాలనను నిర్వహించు కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖ లేదా శాఖలకు ప్రాతినిధ్యము వహించు పదవి రీత్యా కేంద్రప్రభుత్వ సంయుక్త కార్యదర్శి హోదాకు తక్కువ కాని అధికారుల నుండి కేంద్ర ప్రభుత్వముచే నియమించబడు తొమ్మిది మందికి మించనట్టి సభ్యులు;

(డి) ఏకీకృత చెక్‌పోస్టులు కలిగి ఉన్న రాజ్యానికి సంబంధించి ప్రధాన కార్యదర్శి లేదా ప్రభుత్వ కార్యదర్శి హోదాకు తక్కువ కాని ఆయన నామనిర్దేశితుడు;

(ఇ) కేంద్ర ప్రభుత్వముచే నియామకము చేయబడు ఇద్దరు ప్రతినిధులు, వారిలో ఒకరు గుర్తింపు పొందిన కార్మిక నికాయముల నుండి మరియు మరొకరు వర్తకుల నుండి తీసుకొనబడినవారు; మరియు

(ఎఫ్) కార్యకలాప నిర్వహణ నిమిత్తము కేంద్ర ప్రభుత్వము కోఆప్ట్ చేయునట్టి ఇతర ప్రతినిధులు.

(4) ఖండము (బి)లో నిర్దేశించబడిన ఛైర్-పర్సన్ మరియు సభ్యులు కేంద్ర ప్రభుత్వముచే నియమించబడవలెను మరియు వారు పూర్తికాలిక సభ్యులుగా ఉండవలెను.

(5) భద్రత, రవాణా, పరిశ్రమ, వాణిజ్యం, న్యాయ, ఆర్థిక లేదా ప్రభుత్వపాలన రంగంలో ప్రత్యేకమైన పరిజ్ఞానము మరియు అనుభవము కలిగియున్నట్టి వ్యక్తుల నుండి ఛైర్-పర్సనును ఎంపిక చేయవలెను.

సభ్యుని పదవికి అనర్హత.

4. ఒక వ్యక్తి,--

(ఎ) కేంద్ర ప్రభుత్వ అభిప్రాయములో నీతిబాహ్యతతో కూడిన అపరాధమునకు గాను దోషస్థాపన చేయబడి మరియు కారావాస శిక్ష విధించబడిన వాడైనచో; లేక

(బి) అనున్ముక్త దివాలాదారు అయినచో; లేక

(సి) మతి స్థిమితము లేని వాడైయుండి, అట్లని సమర్ధ న్యాయస్థానముచే ప్రఖ్యానించబడిన వాడైనచో; లేదా

(డి) ప్రభుత్వము లేదా ఆ ప్రభుత్వముచే స్వామిత్వము లేదా నియంత్రణ కలిగి ఉన్న నిగమనికాయము యొక్క సర్వీసు నుండి తొలగించబడిన లేదా బర్తరఫు చేయబడిన వాడైనచో; లేదా

(ఇ) కేంద్ర ప్రభుత్వ అభిప్రాయములో ప్రాధికార సంస్థలోని సభ్యునిగా అతని కృత్యమును నిర్వర్తించుటలో భంగపరచు ప్రభావమును కలిగించు విధముగా అట్టి ఆర్థికపరమైన ప్రయోజనములను లేక ఇతర ప్రయోజనములను పొందిన వాడైనచో;

- సభ్యుడుగా నియమించబడుటకు అనర్హుడగును.

సభ్యుల పదవీ కాలావధి మరియు సేవా షరతులు.

5.(1) 6వ పరిచ్ఛేదపు నిబంధనలకు లోబడి, ప్రతి పూర్తికాలిక సభ్యుడు తాను పదవిలో చేరిన తేదీ నుండి ఐదు సంవత్సరముల కాలావధిపాటు లేదా అరువది సంవత్సరముల వయస్సు నిండు వరకు వీటిలో ఏది ముందు ఐతే అప్పటి వరకు పదవి యందుండవలెను:

అయితే, కేంద్ర ప్రభుత్వము--

(ఎ) ఎవరేని పూర్తికాలిక సభ్యుని నియామకమును, మూడు మాసములకు తగ్గని కాలావధికి ఆయనకు నోటీసును ఇచ్చిన తరువాత, లేదా దానికి బదులు మూడుమాసముల కాలావధికి ఆయన జీతము మరియు భత్యములు ఏవేని ఉన్నచో వాటితో కూడిన సమానమైన మొత్తమును చెల్లించిన మీదట పరిసమాప్తము చేయవచ్చును;

(బి) ప్రభుత్వ ఉద్యోగి అయిన ఎవరేని సభ్యుని నియామకమును ఎప్పుడైనను పరిసమాప్తము చేయవచ్చును.

(2) సభ్యుల ఇతర సేవా షరతులు విహితపరచబడునట్టి విధముగా ఉండవలెను.

(3) ఎవరేని సభ్యుడు విహితపరచబడునట్టి కాలావధిలో వ్రాతపూర్వకమైన నోటీసును కేంద్ర ప్రభుత్వమునకు సమర్పించుట ద్వారా తన పదవికి రాజీనామా చేయవచ్చును. మరియు ప్రభుత్వము అధికారిక రాజపత్రములో అట్టి రాజీనామాను అధిసూచించిన మీదట అట్టి సభ్యుడు తన పదవిని ఖాళీచేసినట్లుగా భావించవలెను.

సభ్యులు పదవి నుండి విరమించుట.

6. కేంద్ర ప్రభుత్వము ఒక సభ్యుని, అతను-

(ఎ) 4వ పరిచ్ఛేదములో పేర్కొనిన ఏవేని అనర్హతలకు లోనైనచో:

అయితే, ఈ విషయంలో ఆకర్ణించుకొనుటకు అతనికి యుక్తమైన అవకాశమును ఇచ్చిననే తప్ప, ఆ పరిచ్ఛేదపు ఖండము (ఇ)లో పేర్కొన్న అనర్హతకు గురిఅయినాడనే కారణముపై ఏ సభ్యుని, పదవి నుండి తొలగించరాదు; లేదా

(బి) పనిచేయుటకు నిరాకరించినచో, లేక పనిచేయుటకు అసమర్థుడైనచో; లేదా

(సి) గైరుహాజరుకు అనుమతి పొందకుండా ప్రాధికార సంస్థ యొక్క మూడు వరుస సమావేశములకు గైరుహాజరు అయినచో; లేదా

(డి) కేంద్ర ప్రభుత్వ అభిప్రాయములో అతనిని పదవిలో కొనసాగించుట వలన ప్రజాహితమునకు హానికలుగునట్లు తన హోదాను దుర్వినియోగపరిచినచో:

అయితే, ఈ విషయములో ఆకర్ణించుకొనుటకు అతనికి యుక్తమైన అవకాశమును ఇచ్చిననే తప్ప, ఈ ఖండము క్రింద ఏ సభ్యుని తొలగించరాదు.

పునర్ నియామకమునకు సభ్యుని అర్హత.

7. సభ్యుడుగా ఉండుట నుండి విరమించుచున్న ఎవరేని వ్యక్తి 4వ పరిచ్ఛేదము క్రింద అనర్హుడైననే తప్ప, పునర్నియామకమునకు అర్హత కలిగియుండును.

సమావేశములు.

8.(1) ప్రాధికార సంస్థ, వినియమముల ద్వారా నిబంధించబడునట్టి సమయముల లోను మరియు అట్టి ప్రదేశములలోను సమావేశము కావలెను, మరియు ఆ సమావేశములందు (అట్టి సమావేశముల కోరముతోపాటు) కార్యకలాప నిర్వహణకు సంబంధించి అట్టి ప్రక్రియ యొక్క నియమములను పాటించవలెను.

(2) ప్రాధికార సంస్థ యొక్క ఏదేని సమావేశమునకు ఛైర్-పర్సను ఏదేని కారణము వలన హాజరుకాలేక పోయిన యెడల, ఆ సమావేశమునకు హాజరైన సభ్యుల నుండి ఎంపిక చేసుకొనబడిన ఎవరేని ఇతర సభ్యుడు, ఆ సమావేశమునకు అధ్యక్షత వహించవలెను.

(3) ప్రాధికార సంస్థ యొక్క ఏదేని సమావేశమునందు వచ్చిన అన్ని ప్రశ్నలు, హాజరైన సభ్యులచే వేయబడిన మెజారిటీ ఓట్లు ద్వారా నిర్ణయించబడవలెను, ఆ ఓట్లు సమానముగా వచ్చిన సందర్భంలో ఛైర్-పర్సన్ లేదా అతను హాజరులో లేనప్పుడు అధ్యక్షత వహించు వ్యక్తి కలిగిఉండే రెండవ లేక నిర్ణాయక ఓటును వినియోగించుకో వలెను.

ఖాళీలు మొదలైనటు వంటి వాటి వలన ప్రాధికార సంస్థ ప్రొసీడింగులు శాసన మాన్యతను కోల్పోకుండుట.

9. ప్రాధికార సంస్థ యొక్క ఏ చర్య లేదా ప్రొసీడింగు-

(ఎ) ప్రాధికార సంస్థలో ఏదేని ఖాళీ ఉన్నదను లేదా దానిని సంఘటిత పరచుటలో ఏదేని లోపమున్నదను; లేదా

(బి) ప్రాధికార సంస్థ యొక్క సభ్యుడుగా వ్యవహరించుచున్న వ్యక్తి నియామక ములో ఏదేని లోపము ఉన్నదను; లేదా

(సి) కేసు యొక్క యోగ్యతలను ప్రభావితపరచని ప్రాధికార సంస్థ యొక్క ప్రక్రియలో ఏదేని క్రమరాహిత్యము ఉన్నదను

కారణముపై మాత్రమే శాసన మాన్యతను కోల్పోరాదు.

ప్రాధికార సంస్థ యొక్క అధికారులు మరియు ఇతర ఉద్యోగులు.

10.(1) ఈ చట్టము క్రింద తన కృత్యములను సమర్థవంతముగా నిర్వర్తించుటకు వీలుగా ప్రాధికార సంస్థ తాను అవసరమని భావించునంత మంది అధికారులు మరియు ఇతర ఉద్యోగులను నియామకము చేయవచ్చును:

అయితే, నిర్దిష్టపరచబడునట్టి వర్గాల అధికారుల నియామకం, కేంద్ర ప్రభుత్వ ఆమోదమునకు లోబడి ఉండవలెను.

(2) ప్రాధికార సంస్థచే నియాకము చేయబడిన ప్రతి అధికారి లేక ఇతర ఉద్యోగి వినియమముల ద్వారా నిర్ధారించబడునట్టి సేవా షరతులకు లోబడియుండవలెను మరియు పారితోషికమునకు అర్హుడై ఉండవలెను.

## అధ్యాయము - III
## ప్రాధికార సంస్థ కృత్యములు

ప్రాధికార సంస్థ కృత్యములు.

11.(1) ఈ చట్టపు నిబంధనలకు లోబడి, భారత అంతర్జాతీయ సరిహద్దుల వెంబడి పేర్కొనబడిన ప్రదేశాల వద్ద ప్రయాణీకులు మరియు సరుకులు సరిహద్దును దాటి వెళ్లుట కొరకు సదుపాయములను మెరుగుపరచుటకు, పారిశుద్యము కల్పించుటకు మరియు నిర్వహించుటకు ప్రాధికార సంస్థ అధికారము కలిగి ఉండవలెను.

(2) ఉప-పరిచ్ఛేదము (1)లో ఉన్న నిబంధనల సాధారణతకు భంగము కలుగకుండా,-

(1) ప్రాధికార సంస్థ-

(ఎ) సరిహద్దుపై ఏకీకృత చెక్ పోస్టుల వద్ద తప్పనిసరైన భద్రత ఆవశ్యకముల కొరకు ప్రదేశ వ్యవస్థలను ఏర్పాటుచేయుట;

(బి) ఏకీకృత చెక్‌పోస్టు వద్ద జాతీయ రహదారులు, రాజ్య రహదారులు మరియు రైల్వేలు కానట్టి రోడ్లు, టర్మినళ్లు మరియు అనుబంధ భవనముల ప్రణాళిక, నిర్మించి మరియు వాటిని నిర్వహించుట;

(సి) ఏకీకృత చెక్ పోస్టు వద్ద కమ్యూనికేషను, భద్రత, సరుకుల నిర్వహణ మరియు స్కానింగ్ సామగ్రి ప్రణాళిక, సేకరణ, అమరిక మరియు నిర్వహించుట;

(డి) అవసరమని భావించునట్టి విధముగా వలస, కస్టమ్స్, భద్రత, పన్ను ప్రాధికార సంస్థలు, పశువులు మరియు మొక్కల క్వారంటైన్, గిడ్డంగులు సరుకు రవాణా మరియు బ్యాగేజి పరీక్షించే యార్డులు, పార్కింగ్ జోనులు, బ్యాంకులు, తపాలా కార్యాలయములు, కమ్యూనికేషన్ సదుపాయములు, పర్యాటక సమాచార కేంద్రములు, నిరీక్షణ హాళ్లు, క్యాంటీన్, రిఫ్రెష్‌మెంట్ స్టాళ్లు, ప్రజా సౌకర్యములు, ఆరోగ్య సర్వీసులు మరియు అట్టి ఇతర సేవల కొరకు తగిన ఖాళీ ప్రదేశములను మరియు సదుపాయములను సమకూర్చుట;

(ఇ) ఏకీకృత చెక్ పోస్టుల వద్ద నియోగించబడిన సిబ్బందికి నివాస వసతితో పాటు తన ఉద్యోగులకు నివాస భవనములు నిర్మించుట;

(ఎఫ్) హోటళ్ళు, రెస్టారెంట్లు మరియు విశ్రాంతి గదులను స్థాపించి నిర్వహించుట;

(జి) సరుకులను నిలవచేయుటకు లేదా ప్రాసెసింగ్ చేయుటకు గిడ్డంగులు, కంటైనరు డిపోలు మరియు సరుకుల రవాణా సముదాయములను స్థాపించి నిర్వహించుట;

(హెచ్) ఏకీకృత చెక్ పోస్టుల వద్ద ప్రయాణీకులు మరియు ఇతర వ్యక్తుల ఉపయోగం కోసం తపాలా సౌకర్యము, ద్రవ్య మారకం, బీమా మరియు టెలిఫోను సౌకర్యములను సమకూర్చుట;

(ఐ) ఏకీకృత చెక్ పోస్టుల భద్రతకు తగిన ఏర్పాట్లు చేయుట, వాహనముల రాక పోకలకు సంబంధిత శాసనం ప్రకారం వాహనముల, ప్రయాణీకుల మరియు సరుకుల ప్రవేశ మరియు నిష్క్రమణలను క్రమబద్ధీకరించి నియంత్రించుట;

(జె) అవసరమని భావించినట్టి విధముగా అగ్ని ప్రమాదములు మరియు ఇతర విపత్తులను నివారించి నియంత్రించేందుకు తగిన సౌకర్యములను కల్పించుట;

(కె) భారత ప్రభుత్వ శాసనము, భద్రత మరియు ప్రోటోకాల్ విషయంలో తగిన గౌరవ భావంతో ఏకీకృత చెక్ పోస్టు వద్ద వాహనాల రాకపోకలను మరియు ప్రయాణీకులు, రవాణా కార్మికులు, హేండిలింగు ఏజెంట్లు, క్లియరింగు మరియు ఫార్వాడింగ్ ఏజెంట్లు మరియు సరుకుల యొక్క ప్రవేశ మరియు నిష్క్రమణలను క్రమబద్ధీకరించి, నియంత్రించుట;

(ఎల్) ప్రస్తుతము అమలులో ఉన్న ఆయా శాసనాల ప్రకారం ఏకీకృత చెక్ పోస్టుల వద్ద వివిధ కార్యకలాపాలను చేపట్టడం కొరకు నియోగించబడిన ఏజెన్సీల పని తీరును సమన్వయము చేసి సుగమము చేయుట;

(యమ్) ఏకీకృత చెక్ పోస్టుకు సంబంధించి భారత దేశంలోను మరియు విదేశంలోను కన్సెల్టెన్సీ, నిర్మాణం లేదా నిర్వహణ సేవలను అభివృద్ధి చేసి సమకూర్చడం మరియు చర్యలను చేపట్టుట;

(1956లోని 1వది)

(ఎన్) ఈ చట్టము ద్వారా దానిపై విధించిన కృత్యములను సమర్థవంతముగ నెరవేర్చు నిమిత్తము కంపెనీల చట్టము, 1956 క్రింద లేదా కంపెనీలకు సంబంధించి ఏదేని ఇతర శాసనం క్రింద ఒకటి లేదా అంతకంటే ఎక్కువ కంపెనీలను ఏర్పాటు చేయుట;

(ఓ) ఈ చట్టము ద్వారా ఒసగబడిన లేదా దానిపై విధించబడిన ఏదేని అధికారమును వినియోగించి లేదా ఏదేని కృత్యమును నిర్వ ర్తించుట కొరకు అవసరమైన లేదా సముచితమైన లేదా ఆనుషంగికమైన అన్ని చర్యలను చేపట్టవలెను:

అయితే, ప్రాధికార సంస్థ యొక్క సార్వభౌమత్వ కృత్యములను ఎటువంటి ప్రైవేటు అస్థిత్వమునకు అప్పగించరాదు.

(పి) ప్రాధికార సంస్థకు అప్పగించబడిన ఏవేని కృత్యములను నిర్వ ర్తించుట కొరకు ఉమ్మడి రంగ సంస్థలను ఏర్పాటు చేయుట; మరియు

(క్యూ) ప్రాధికార సంస్థ యొక్క అత్యుత్తమ వాణిజ్య ప్రయోజనాల కొరకు ఏకీకృత చెక్ పోస్టు వద్ద ఏవేని ఇతర కార్యకలాపములను చేపట్టుట వంటి ఏర్పాట్లు చేయవలెను.

(3) ఈ పరిచ్ఛేదము క్రింద తన కృత్యములను నిర్వ ర్తించటంలో ప్రాధికార సంస్థ తాను అవసరమని భావించునట్టి విధముగా భారత ప్రభుత్వము లేక రాజ్య ప్రభుత్వము యొక్క అట్టి మంత్రిత్వ శాఖను లేదా శాఖను సంప్రదించవచ్చును మరియు భూ మార్గము వద్ద సర్వీసుల అభివృద్ధికి మరియు అట్టి సర్వీసుల సామర్థ్యము, ఆర్థిక స్తోమత మరియు సంరక్షణకు తగునట్లుగా వ్యవహరించవలెను.

(4) ఈ పరిచ్ఛేదములో నున్నదేదియు-

(ఎ) తత్సమయమున అమలులోనున్న ఏదేని శాసనమును ప్రాధికార సంస్థ ఉపేక్షించబడుటకు అధికారమీయబడినదని; లేదా

(బి) ప్రాధికార సంస్థ లేదా దాని అధికారులు లేదా ఇతర ఉద్యోగులు ఇతర విధముగా లోబడకుండా కర్తవ్యము లేదా దాయిత్వము విషయములో ఏదేని ప్రొసీడింగును దాఖలు చేయడానికి ఎవరేని వ్య క్తికి అధికారమీయబడినదని-

అన్వయించుకొనరాదు.

ఇతర ఏజెన్సీల ఉత్తర దాయిత్వము మరియు అధికారములు.

12.(1) భారత సరిహద్దుల వద్ద నియోగించబడిన ఆయా సరిహద్దు రక్షక దళాలు ఏకీకృత చెక్ పోస్టు చుట్టు ప్రక్కల భద్రతకు ఉత్తర దాయిత్వము వహించవలెను.

(2) ఏకీకృత చెక్ పోస్టు వద్ద శాంతి మరియు భద్రతలు నెలకొని ఉండేటట్లు చూచుట కొరకు ప్రాధికార సంస్థ ఆ విధముగా చేయవలసిన అవసరం ఉందని భావించినప్పుడు, ప్రస్తుతం అమలులోనున్న శాసన నిబంధనల ప్రకారం సాయుధ దళం, కేంద్ర పారామిలటరీ దళం లేదా రాజ్య పోలీసుల సహాయమును కోరవచ్చును.

(3) ప్రాధికారసంస్థ తన కృత్యములను సమర్ధవంతముగా నిర్వ ర్తించు నిమిత్తము కస్టమ్స్, వలస, క్వారంటైను మరియు తదితర అధికారులు ప్రాధికార సంస్థతో సమన్వయంగా వ్యవహరించవలెను.

(4) ఈ చట్టపు ఏవేని నిబంధనలలో ఏమి ఉన్నప్పటికినీ, కస్టమ్స్, వలస, క్వారంటైను అధికారులు, సరిహద్దు రక్షక దళాలు మరియు పోలీసులు ప్రస్తుతము అమలులోనున్న శాసనము ప్రకారము తమ కృత్యములను నిర్వ ర్తించవలెను.

## అధ్యాయము - IV
## ఆస్తి మరియు కాంట్రాక్టు

ప్రాధికార సంస్థలో ఆస్తులు మరియు దాయిత్వములను నిహితము చేయుట.

13.(1) 2వ పరిచ్ఛేదపు ఖండము (డి) క్రింద జారీఅయిన అధిసూచన తేదీనాటికి ఉన్నట్టి అన్ని ఆస్తులు, హక్కులు, అధికారములు, ప్రాధికారములు మరియు విశేషాధికార ములు మరియు భూములు, భవనములు, యంత్ర సామగ్రి, పరికరములు, పనులు, వర్క్ షాపులు, నగదు నిల్వలు, మూలధనం, రిజర్వులు, రిజర్వు నిధులు, పెట్టుబడులు, కౌలుదారీలు, నష్టములు మరియు ఖాతాదాఖలా అప్పులతోసహా చర మరియు స్థిర, వాస్తవిక లేక స్వంత, భౌతిక లేక అభౌతిక ప్రస్తుత లేదా ఆగంతుక ఏ రూపంలోనున్నను అట్టి ఆస్తి మరియు ఆ అధిసూచన జారీకి అవ్యవహిత పూర్వము ఉన్నట్టి ఆస్తి నుండి ఉత్పన్నమయ్యే ఇతర హక్కులు మరియు హితములతోసహా మరియు ఏదేని భూ మార్గములో భారత ప్రభుత్వ యాజమాన్యపు లేదా స్వాధీనములో చేరియున్న అట్టి వాటిని, భారత ప్రభుత్వము అట్టి అధిసూచనలో నిర్ధిష్టపరచిన విధంగా ప్రాధికారసంస్థలో నిహితము కావలెను మరియు అట్టి నిహితములో ఏ రూపములో అయినను అప్పుడు ఉన్న అన్ని అప్పులు, దాయిత్వములు మరియు బాధ్యతలు చేరి ఉన్నట్లుగా భావించవలెను.

(2) మంత్రిత్వ శాఖలు లేదా శాఖల స్వామిత్వము లేదా నియంత్రణలో అట్టి ఆస్తులు ఉన్నయెడల భారత ప్రభుత్వ సంబంధిత మంత్రిత్వ శాఖలు లేదా శాఖల సమ్మతిని పొందిన తరువాత మాత్రమే ఉప-పరిచ్ఛేదము (1) క్రింది అధిసూచనను జారీచేయవలెను.

ప్రాధికార సంస్థలో స్వాధీనస్థ సంస్థలను నిహితం చేయడం వలన సాధారణ ప్రభావం.

14. 2వ పరిచ్ఛేదపు ఖండము (డి) క్రింద జారీ అయిన అధిసూచన తేదీకి అవ్యవహిత పూర్వము ఉన్నట్టి అన్ని కాంట్రాక్టులు, కరారులు మరియు నిర్వహణ ఏర్పాట్లు మరియు భూమార్గ ముఖ ద్వారములకు భంగం కలిగించడం, ప్రాధికార సంస్థ విషయంలో పూర్తి ప్రాబల్యము మరియు ప్రభావాలు చూపుతాయి.

హామీ అమలు కలిగిఉండుట.

15. ఋణము, కౌలు లేదా ఆర్థిక సహాయములకు సంబంధించి భూమార్గ కస్టమ్స్ కేంద్రాల లేదా వలస చెక్ పోస్టుల కొరకు లేదా సానుకూలంగ ఇచ్చిన ఏదేని హామీ, ఈ చట్టము రీత్యా ప్రాధికార సంస్థలో నిహితమై ఉన్నట్టి స్టేషన్లు లేదా చెక్ పోస్టులకు సంబంధించి అమలును కలిగి ఉండవలెను.

ప్రాధికార సంస్థ కొరకు తప్పనిసరి భూమి అధ్యార్జన. 1956లోని 48వది.

16. ఈ చట్టము క్రింద ప్రాధికార సంస్థ తన కృత్యములను నిర్వర్తించు నిమిత్తము పొందిన ఏదేని భూమిని, ప్రజా ప్రయోజనం కోసం దానికి అవసరమైనదిగా భావించవలెను మరియు అట్టి భూమిని జాతీయ రహదారుల చట్టము, 1956 లేదా తత్సమయమున అమలులోనున్న ఏదేని ఇతర శాసనపు నిబంధనల క్రింద ప్రాధికార సంస్థ కొరకు సేకరించబడినదిగా భావించవలెను.

ప్రాధికార సంస్థచే కాంట్రాక్టులు.

17. 18వ పరిచ్ఛేదపు నిబంధనలకు లోబడి, ప్రాధికార సంస్థ, ఈ చట్టము క్రింద తన కృత్యములను నిర్వర్తించుట కొరకు అవసరమైన ఏదేని కాంట్రాక్టును కుదుర్చుకొని మరియు దానిని నిర్వహించడానికి సమర్థత కలిగి ఉండును.

ప్రాధికార సంస్థ తరపున కాంట్రాక్టు అమలు జరుపు పద్ధతి.

18.(1) ప్రాధికార సంస్థ తరఫున ప్రతి కాంట్రాక్టు, ఛైర్-పర్సన్ లేదా ఈ విషయంలో ప్రాధికార సంస్థచే సాధారణ లేదా ప్రత్యేకంగా అధికారమొసగబడిన అధికారిచే చేయబడ వలెను మరియు వినియమములలో నిర్దిష్టపరచబడిన విధముగా కాంట్రాక్టులను ప్రాధికార సంస్థ యొక్క సామాన్య మొహరుతో ముద్ర వేయవలెను:

అయితే, కేంద్ర ప్రభుత్వము ఈ విషయంలో ఉత్తర్వు ద్వారా నిర్ధారించునట్టి విలువ లేదా మొత్తమునకు మించినట్టి కాంట్రాక్టును కేంద్ర ప్రభుత్వ పూర్వానుమోదముతో తప్ప చేయరాదు:

అంతేకాక, ఇంకనూ, స్థిరాస్తి సేకరణకు లేదా విక్రయము కొరకు లేదా ముప్పై సంవత్సరములకు మించిన కాలావధికి ఏదేని అట్టి ఆస్తిని కౌలుకు ఇవ్వడం కొరకైన కాంట్రాక్టు మరియు ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వము ఉత్తర్వు ద్వారా నిర్ధారించునట్టి విలువ లేదా మొత్తమునకు మించినట్టి ఏదేని ఇతర కాంట్రాక్టును కేంద్ర ప్రభుత్వ పూర్వానుమోదముతో తప్ప చేయరాదు.

(2) ఉప-పరిచ్ఛేదము (1) యొక్క నిబంధనలకు లోబడి, ఈ చట్టము క్రింద చేసిన ఏదేని కాంట్రాక్టు యొక్క ప్రరూపము మరియు రీతి వినియమములచే నిబంధించ బడునట్టి విధముగా ఉండవలెను.

(3) ఈ చట్టపు నిబంధనలు మరియు దానిక్రింద చేసిన నియమములు మరియు వినియమములననుసరించి చేయబడని ఏ కాంట్రాక్టుకును ప్రాధికార సంస్థ బద్ధమై ఉండదు.

## అధ్యాయము - V

## ఆర్థిక, లెక్కలు మరియు ఆడిటు.

ఫీజులు, అద్దె మొదలైన వాటిని విధించడానికి ప్రాధికార సంస్థ యొక్క అధికారము.

19. ప్రాధికార సంస్థ, ప్రతీ ఏకీకృత చెక్ పోస్టు వద్ద విడిగా వినియమముల ద్వారా నిబంధించిన విధంగా ఏదేని ఇతర చట్టము క్రింద శాసనపరమైన విధింపు కానట్టి ఇతర ఫీజును లేదా అద్దెను ఈ క్రింది వాటి కొరకు నిర్ధారించి మరియు విధించవచ్చును,-

(ఎ) సరుకు రవాణా నిర్వహణ పనులకు, గిడ్డంగులలో చేర్చుటకు, ట్రక్కుల పార్కింగుకు లేక ఏదేని ఇతర సేవ లేదా రవాణా సౌకర్యం కొరకు;

(బి) ప్రయాణీకుల వాహనముల పార్కింగు కొరకు మరియు ప్రయాణీకులు మరియు సందర్శకులకు కల్పించు ఇతర సదుపాయముల కొరకు; మరియు

(సి) ప్రాధికార సంస్థ సమకూర్చిన సౌకర్యములు మరియు ఇతర సేవలను వినియోగించుట కొరకు.

కేంద్ర ప్రభుత్వముచే ప్రాధికార సంస్థకు సమకూర్చబడు అదనపు మూలధనము మరియు అనుదానము

20. ఈ విషయములో శాసనము ద్వారా పార్లమెంటు వినియోజనం చేసిన తరువాత కేంద్ర ప్రభుత్వము ఈ క్రింది వాటిని చేయవచ్చును,-

(ఎ) ప్రభుత్వము నిర్ధారించునట్టి విధంగా ఈ చట్టము క్రింద ప్రాధికార సంస్థ తన కృత్యములను నిర్వర్తించుట కొరకు లేదా అట్టి నిబంధనల మరియు షరతులపై దానికి సంబంధించిన ఏదేని ప్రయోజనం కొరకు తనకు అవసరమైన ఏదేని మూలధనమును, సమకూర్చుకొనుట;

(బి) ఈ చట్టము క్రింద ప్రాధికార సంస్థ తన కృత్యములను సమర్ధవంతముగా నిర్వర్తించు నిమిత్తం కేంద్ర ప్రభుత్వము అవసరమని భావించునట్టి విధంగా ఋణములు లేదా అట్టి ద్రవ్య మొత్తములను అనుదాన రూపంలో కేంద్ర ప్రభుత్వం నిర్ధారించునట్టి నిబంధనలు మరియు షరతులపై ప్రాధికార సంస్థకు చెల్లించుట.

ప్రాధికార సంస్థ యొక్క నిధి మరియు దాని పెట్టుబడి.

21.(1) ప్రాధికార సంస్థ తన సొంత నిధిని ఏర్పాటు చేసుకొనవలెను మరియు ప్రాధికార సంస్థ యొక్క వసూళ్లన్నింటిని దానికి జమచేయవలెను మరియు ప్రాధికార సంస్థ చేయు చెల్లింపులన్నింటిని దాని నుండి చేయవలెను.

(2) ఈ చట్టపు నిబంధనలకు లోబడి, ప్రాధికార సంస్థ తాను యుక్తమని భావించినట్టి మొత్తములను పరిపాలనా ఖర్చులన్నింటితో సహా ఖర్చు చేయడానికి లేదా ఈ చట్టము ద్వారా ప్రాధికారము పొందిన ప్రయోజనములన్నింటి కొరకు అధికారము కలిగియుండును మరియు అట్టి మొత్తములను ప్రాధికార సంస్థ యొక్క నిధి నుండి ఖర్చు చేసే వ్యయముగా పరిగణించవలెను.

(3) ఉప-పరిచ్ఛేదము (2)లో నిబంధించిన విధంగా వెంటనే వినియోగించలేనట్టి ప్రాధికార సంస్థ ఖాతాలోనున్న ద్రవ్యములన్నియు-

(ఎ) కేంద్ర ప్రభుత్వముచే ఆయా సమయములందు నిర్దిష్టపరచబడునట్టి షరతులకు లోబడి, భారతీయ స్టేట్ బ్యాంకు లేదా ఏదేని అట్టి షెడ్యూల్డు బ్యాంకు లేదా బ్యాంకులు లేదా ఇతర పబ్లిక్ ఆర్థిక సంస్థలలో జమ/డిపాజిటు చేయవలెను;

(బి) కేంద్ర ప్రభుత్వం యొక్క సెక్యూరిటీలలో లేదా విహితపరచబడునట్టి రీతిలో పెట్టుబడిగా నిహితము చేయవలెను.

(1934లోని 2వది)

విశదీకరణ:- ఈ ఉప-పరిచ్ఛేదములో, "షెడ్యూల్డు బ్యాంకు" అను పదమునకు భారతీయ రిజర్వు బ్యాంకు చట్టము, 1934లోని 2వ పరిచ్ఛేదపు ఖండము (ఈ)లోని అర్థమునే కలిగి ఉండును.

మిగులు నిధుల కేటాయింపు.

22.(1) ఏదేని ఏకీకృత చెక్ పోస్టు వద్ద ప్రస్తుతమున్న సౌకర్యముల లేదా సేవల విస్తరణకు లేక కొత్తగా సౌకర్యములు లేదా సేవలను కల్పించుటకు లేక ఏదేని ప్రకృతి వైపరీత్యము లేదా ప్రమాదము వలన సంభవించిన నష్టము లేక చెరుపు మూలంగా వాటిని తిరిగి ఏర్పాటు చేయుటకు లేక పెరిగిన వ్యయమును భరించుటకు లేక ఈ చట్టము క్రింద తన కృత్యములను నిర్వ ర్తించుటలో ఏదేని పనిని చేయుట వలన లేదా ఏదేని పనిని చేయకుండుట వలన తాత్కాలిక, కారణములవల్ల ఉత్పన్నమయ్యే ఏదేని దాయిత్వమును భరించుటకు, ప్రాధికార సంస్థ ఆయా సమయములందు తాను ఉచితమని భావించునట్టి మొత్తములను రిజర్వు నిధికి లేదా రిజర్వు నిధుల కొరకు ప్రత్యేకించవచ్చును:

అయితే, నిర్దిష్టమైన ప్రయోజనముల నిమిత్తము నిర్దిష్టమైన రిజర్వులను ఏర్పాటు చేసుకొనుటకు కూడా ప్రాధికార సంస్థ అధికారమును కలిగివుండును:

అంతేకాక ఇంకనూ, ప్రతీ లేదా ఏదేని నిర్దిష్టమైన మరియు సాధారణ రిజర్వుల విషయములో వార్షికముగా ప్రత్యేకించబడు మొత్తము మరియు ఎప్పుడైనను అట్టి మొత్తముల వెరశి మొత్తము, కేంద్ర ప్రభుత్వము ఈ విషయములో ఆయా సమయములందు నియతముచేయునట్టి పరిమితులకు మించకుండా ప్రత్యేకించ వచ్చును.

(1956లో 1వది)

(2) అట్టి రిజర్వు నిధి లేదా నిధుల కొరకు మరియు రాని మరియు సంశయాత్మక బాకీల వల్ల ఆస్తులలో సంభవించిన తరుగుదలకు మరియు కంపెనీల చట్టము, 1956 క్రింద రిజిస్టరు అయిన మరియు నిగమితమొనర్చబడిన కంపెనీలచే సాధారణంగా సమకూర్చబడిన అన్ని ఇతర విషయముల కొరకుగాను ఏర్పాటు చేయబడిన తరువాత, ప్రాధికార సంస్థ తన వార్షిక నికర లాభాలలోని మిగులును కేంద్ర ప్రభుత్వమునకు చెల్లించవలెను.

కార్యకలాపముల యొక్క కార్యక్రమ మును మరియు ఆర్థిక అంచనాలను సమర్పించుట.

23. ప్రాధికార సంస్థ, ప్రతి ఆర్థిక సంవత్సరము ప్రారంభమునకు ముందు, రాబోయే ఆర్థిక సంవత్సరములో తన కార్యకలాపాల కార్యక్రమ వివరణను, అంతేకాకుండ దానికి సంబంధించిన ఆర్థిక అంచనాను తయారుచేసి, దానిని కేంద్ర ప్రభుత్వ ఆమోదము నిమిత్తము సమర్పించవలెను.

అప్పు తీసుకొనుటకు ప్రాధికార సంస్థకు గల అధికారములు.

24.(1) ప్రాధికార సంస్థ, కేంద్ర ప్రభుత్వ సమ్మతితో తనకు ఇవ్వబడిన ఏదేని సాధారణ లేక ప్రత్యేక ప్రాధికారము యొక్క నిబంధనలననుసరించి ఈ చట్టము క్రింద అన్నీ లేదా ఏవేని తన కృత్యములను నిర్వ ర్తించుట కొరకు బాండులను, డిబెంచర్లను లేదా తాను యుక్తమని భావించునట్టి ఇతర పత్రాలను జారీచేయడం ద్వారా ఏదేని వనరు నుండి డబ్బును అప్పుగా తీసుకొనవచ్చును.

(2) కేంద్ర ప్రభుత్వము, ఉప-పరిచ్ఛేదము (1) క్రింద ప్రాధికార సంస్థ తీసికొనిన అప్పుల విషయంలో అసలును తిరిగి చెల్లించుటకు మరియు దానిపై వడ్డీని చెల్లించుటకు తాను యుక్తమని భావించునట్టి రీతిలో హామీ ఇవ్వవచ్చును.

(3) కేంద్ర ప్రభుత్వము ఆయా సమయములందు పొందుపరచునట్టి పరిమితులకు లోబడి, ప్రాధికార సంస్థ ఈ చట్టము క్రింద తన కృత్యములను నిర్వర్తించుటకు తనకు అవసరమైనట్టి మొత్తమును ఓవరు డ్రాఫ్టు రూపములో లేదా ఇతర విధముగా తాత్కాలికముగా అప్పును తీసుకొనవచ్చును.

లెక్కలు మరియు ఆడిటు.

25.(1) ప్రాధికార సంస్థ సక్రమమైన లెక్కలను మరియు ఇతర సంబంధిత రికార్డులను నిర్వహించవలెను. మరియు భారత కంప్ట్రోలరు మరియు ఆడిటరు జనరలుతో సంప్రదించి, కేంద్ర ప్రభుత్వముచే విహితపరచబడునట్టి ప్రరూపములో లాభ నష్టాల ఖాతాను మరియు ఆస్తి అప్పుల పట్టికతోసహా వార్షిక లెక్కల వివరణను తయారు చేయవలెను.

(2) ప్రాధికార సంస్థ యొక్క లెక్కలు వార్షికంగా భారత కంప్ట్రోలరు మరియు ఆడిటరు జనరలుచే ఆడిటు చేయబడవలెను, అట్టి ఆడిటుకు సంబంధించి అతను చేసిన ఏదేని వ్యయమును ప్రాధికార సంస్థ ద్వారా అతను తిరిగి రాబట్టు కొనవచ్చును.

(3) ప్రాధికార సంస్థ యొక్క లెక్కల ఆడిటు చేయు సందర్భములో భారత కంప్ట్రోలరు మరియు ఆడిటరు జనరలు, మరియు అతనిచే నియమింపబడిన ఎవరేని ఇతర వ్యక్తి ప్రభుత్వ లెక్కల ఆడిటు సందర్భములో కంప్ట్రోలరు మరియు ఆడిటరు జనరలు కలిగి యుండునట్లుగానే అట్టి ఆడిటుకు సంబంధించి అవే హక్కులు మరియు విశేషాధికారములు మరియు ప్రాధికారము కలిగియుండును, మరియు ప్రత్యేకించి పుస్తకములు, లెక్కలు, సంబంధిత ఓచర్లు, దస్తావేజులు మరియు పత్రములను సమర్పించవలసినదని డిమాండు చేయుటకు మరియు ప్రాధికార సంస్థ యొక్క ఏవేని కార్యాలయములను తనిఖీ చేయుటకు హక్కు కలిగియుండును.

(4) ఈ విషయములో భారత కంప్ట్రోలరు మరియు ఆడిటరు జనరలు లేదా అతనిచే నియమించబడిన ఎవరేని ఇతర వ్యక్తిచే ధృవీకరించబడిన ప్రాధికార సంస్థ యొక్క లెక్కలను మరియు దానితోపాటుగా దానికి సంబంధించిన ఆడిటు నివేదికను కేంద్ర ప్రభుత్వమునకు వార్షికముగా పంపవలెను మరియు ఆ ప్రభుత్వము వాటిని పార్లమెంటు ఉభయ సభల సమక్షమున ఉంచవలెను.

## అధ్యాయము - VI

## వివిధములు.

వార్షిక నివేదికను సమర్పించుట.

26.(1) ప్రాధికార సంస్థ, ప్రతి ఆర్థిక సంవత్సరము ముగిసిన తరువాత సాధ్యమైనంత త్వరగా, ఆ ఆర్థిక సంవత్సరములో తన కార్యకలాపాల వివరణలను పొందుపరుస్తూ ఒక నివేదికను తయారు చేసి మరియు విహితపరచబడునట్టి ప్రరూపములో కేంద్ర ప్రభుత్వము నకు సమర్పించవలెను, మరియు రాబోయే ఆర్థిక సంవత్సర కాలంలో ప్రాధికార సంస్థ చేపట్టడానికి అవకాశము గల కార్యకలాపాల వివరణలను నివేదికలో కూడ పొందుపరచ వలెను.

(2) దానిని సమర్పించిన పిమ్మట సాధ్యమైనంత త్వరగా కేంద్ర ప్రభుత్వము అట్టి నివేదిక పార్లమెంటు ఉభయ సదనముల సమక్షములో ఉంచబడునట్లు చూడవలెను.

ప్రత్యాయోజనము.

27. . ప్రాధికార సంస్థ, వ్రాత పూర్వకమైన సాధారణ లేదా ప్రత్యేక ఉత్తర్వుల ద్వారా, అందులో నిర్దిష్టపరచబడునట్టి షరతులు మరియు పరిమితులు ఏవైనా ఉన్నచో వాటికి లోబడి, చట్టము క్రింద తాను అవసరమని భావించునట్టి అధికారములు మరియు కృత్యములను (35వ పరిచ్ఛేదము క్రింద అధికారములు మినహా) ప్రాధికార సంస్థ యొక్క ఛైర్-పర్సన్‌కు లేదా ఎవరేని సభ్యునికి లేదా ఎవరేని అధికారికి ప్రత్యాయోజనము చేయవచ్చును.

ప్రాధికార సంస్థ యొక్క ఉత్తర్వులు మరియు ఇతర పత్రములను అధిప్రమాణీకరించుట.

28. ఈ విషయములో ప్రాధికార సంస్థ అన్ని ఉత్తర్వులు మరియు నిర్ణయములు దానియొక్క ఛైర్-పర్సన్ లేదా ఈ విషయములో దానిచే ప్రాధీకృతుడైన ఎవరేని ఇతర సభ్యుని సంతకముచే అధిప్రమాణీకృతము చేయబడవలెను. మరియు ఈ విషయములో ప్రాధికార సంస్థ వ్రాతమూలకముగా ఇచ్చు అన్ని ఇతర పత్రములు దాని ద్వారా ప్రాధికారము పొందిన అధికారి సంతకముచే అధిప్రమాణీకరించబడవలెను.

ప్రాధికార సంస్థ అధికారులు మరియు ఉద్యోగులు, పబ్లిక్ సేవకులుగా ఉండుట. (1860లోని 45వది)

29. ఈ చట్టపు నిబంధనలు లేదా దాని క్రింద చేయబడిన ఏదేని నియమము లేదా వినియమమునునసరించి, పనిచేయు లేదా పనిచేయుటకు ఉద్దేశించబడిన ప్రాధికార సంస్థ యొక్క అధికారులు మరియు ఉద్యోగులు అందరూ భారత శిక్షాస్మృతి యొక్క 21వ పరిచ్ఛేదపు అర్థములో పబ్లికు సేవకులుగా భావించబడవలెను.

సద్భావముతో తీసుకొనబడిన చర్యకు రక్షణ.

30 ఈ చట్టము లేదా దాని క్రింద చేయబడిన ఏదేని నియమము లేదా వినియమమును అనుసరించి సద్భావముతో చేసిన లేక చేయుటకు ఉద్దేశించిన దేనికైనను ప్రాధికార సంస్థ లేదా దాని యొక్క ఎవరేని సభ్యుడు లేక ఎవరేని అధికారి లేక ఇతర ఉద్యోగిపై ఎట్టి దావా, అభియోగము లేక ఇతర శాసనిక చర్యఉండదు.

పోగొట్టుకొన్న ఆస్తి అభిరక్ష మరియు వ్యయనము.

31. ఏదేని ఆస్తి సక్రమమైన అభిరక్షలో లేకుండా ప్రాధికార సంస్థకు చెందిన లేదా దాని పూర్తి నియంత్రణ క్రింద ఉన్న ఏదేని ప్రాంగణములో దానిని కనుగొన్నప్పుడు ఈ విషయములో ప్రాధికార సంస్థ చేయునట్టి వినియమములకు అధ్యధీనమై దానిని సురక్షితమైన ఆధీనములో భద్రపరచుటకు మరియు పునరుద్ధరించడానికి ప్రాధికార సంస్థ తగు ఏర్పాటుగావించవలెను.

ప్రాధికార సంస్థను రద్దుపరచుటకు కేంద్ర ప్రభుత్వమునకు గల అధికారము.

32.(1) ఎప్పుడైనను కేంద్ర ప్రభుత్వము-

(ఎ) ఈ చట్టపు నిబంధనలచే లేదా దానిక్రింద ప్రాధికార సంస్థపై విధించబడిన కృత్యములు మరియు కర్తవ్యములను తీవ్రమైన అత్యాయిక పరిస్థితి మూలముగా అది నిర్వహించలేక పోవుచున్నదని; లేదా

(బి) ఈ చట్టము క్రింద కేంద్ర ప్రభుత్వముచే జారీచేయబడిన ఏదేని ఆదేశమును పాటించుటలోను లేదా ఈ చట్టపు నిబంధనల ద్వారా లేదా దాని క్రింద ప్రాధికార సంస్థపై విధించబడిన కృత్యములు మరియు కర్తవ్యములను నిర్వ ర్తించుటలో తరచుగా అది వ్యతిక్రమణ జరుగుచున్నదని మరియు ఆ వ్యతిక్రమణ ఫలితంగా, ప్రాధికార సంస్థ యొక్క ఆర్థిక పరిస్థితి లేదా ఏకీకృత చెక్ పోస్ట్ యొక్క పరిపాలన క్షీణిస్తున్నదని; లేదా

(సి) ప్రస్తుతమున్న పరిస్థితులలో ప్రజాహితము దృష్ట్యా దానిని రద్దుపరచవలసిన అవసరం ఉన్నదని అభిప్రాయపడినచో, కేంద్ర ప్రభుత్వము, అధికారిక రాజపత్రములో అధిసూచన ద్వారా, అందులో నిర్దిష్టపరచబడునట్లుగా ఆరు మాసములకు మించనట్టి కాలావధిపాటు ప్రాధికార సంస్థను రద్దుపరచ వచ్చును:

అయితే, ఈ ఉప-పరిచ్ఛేదము క్రింద అధిసూచన జారీచేయుటకు ముందు, ఖండము (బి)లో పేర్కొనిన కారణములపై కేంద్ర ప్రభుత్వము దానిని ఎందుకు రద్దుపరచరాదో సంజాయిషీలు కోరుతూ కారణములను తెలియ చేయవలసిందిగా ప్రాధికార సంస్థకు తగిన అవకాశమును ఈయవలెను మరియు ప్రాధికార సంస్థ యొక్క స్పష్టీకరణలు మరియు ఆక్షేపణలు ఏవేని ఉన్నచో వాటిని పర్యాలోచించవలెను.

(2) ప్రాధికార సంస్థను రద్దుపరచుచూ ఉప-పరిచ్ఛేదము(1) క్రింద అధిసూచనను ప్రచురించిన మీదట,-

(ఎ) ప్రాధికార సంస్థ రద్దుపరచిన తేదీ నుండి దాని సభ్యులందరూ తమ తమ పదవులను ఖాళీ చేయవలెను;

(బి) ఈ చట్టములోని నిబంధనల ద్వారా లేదా దాని క్రింద ప్రాధికార సంస్థచే లేదా దాని తరఫున వినియోగించబడు లేదా నిర్వ ర్తించబడు అన్ని అధికారములు, కృత్యములు మరియు కర్తవ్యములు ఉప-పరిచ్ఛేదము (3) క్రింద ప్రాధికార సంస్థ పునస్సంఘటితము చేయబడునంత వరకు కేంద్ర ప్రభుత్వము ఆదేశించునట్టి వ్యక్తి లేదా వ్యక్తుల ద్వారా వినియోగించబడ వలెను మరియు నిర్వ ర్తించబడవలెను; మరియు

(సి) ప్రాధికార సంస్థ స్వాధీననందు కలిగియున్న లేదా నియంత్రణలో ఉన్న అన్ని ఆస్తులు ఉప-పరిచ్ఛేదము (3) క్రింద ప్రాధికార సంస్థను పునస్సంఘ టితము చేయబడునంత వరకు కేంద్ర ప్రభుత్వములో నిహితమై ఉండును.

(3) ఉప-పరిచ్ఛేదము (1) క్రింద జారీచేయబడిన అధిసూచనలో నిర్ధిష్టపరచ బడిన రద్దుపరచు కాలావధి ముగిసిన మీదట, కేంద్ర ప్రభుత్వము,--

(ఎ) తాను అవసరమని భావించిన విధముగా ఆరు మాసములకు మించనట్టి కాలముతోపాటు రద్దుపరచు కాలావధిని పొడిగించవచ్చును; లేదా

(బి) క్రొత్త నియామకము ద్వారా ప్రాధికార సంస్థను పునస్సంఘటితము చేయ వచ్చును మరియు, అట్టి సందర్భములో ఉప-పరిచ్ఛేదము (2) యొక్క ఖండము (ఎ) క్రింద పదవులను ఖాళీ చేసిన సభ్యులను నియామకమునకు అనర్హులుగా భావించరాదు:

అయితే, కేంద్ర ప్రభుత్వము, రద్దుపరచు కాలావధి ముగియుటకు పూర్వము ఎప్పుడైనను, అది మొదటిగా ఉప-పరిచ్ఛేదము (1) క్రింద నిర్ధిష్ట పరచబడిన విధంగాగాని లేదా ఈ ఉప-పరిచ్ఛేదము క్రింద పొడిగించబడిన విధంగాగాని, ఈ ఉప-పరిచ్ఛేదపు ఖండము (బి) క్రింద చర్య తీసుకొన వచ్చును.

(4) కేంద్ర ప్రభుత్వము, ఉప-పరిచ్ఛేదము (1) క్రింది అధిసూచనను జారీ చేయుటకు మరియు ఈ పరిచ్ఛేదము క్రింద తీసుకొన్న ఏదేని చర్య యొక్క పూర్తి నివేదికను మరియు ఆ చర్య తీసుకోవడానికి దారితీసిన పరిస్థితులు, తరువాత వెను వెంటనే వచ్చు పార్లమెంటు సమావేశపు ఉభయ సదనముల సమక్షములోను ఉంచబడునట్లు చూడవలెను.

ఆదేశములను జారీ చేయుటకు కేంద్ర ప్రభుత్వమునకు గల అధికారము.

33.(1) ఈ చట్టము యొక్క పైన తెలిపిన నిబంధనలకు భంగము కలుగకుండా ప్రాధికారసంస్థ ఈ చట్టము క్రింద తన కృత్యములు మరియు కర్తవ్యములను నిర్వ ర్తించుటలో కేంద్ర ప్రభుత్వముచే ఆయా సమయములందు విధానపరమైన ప్రశ్నలపై వ్రాతపూర్వకముగా ఇవ్వబడునట్టి ఆదేశములకు బద్ధమై ఉండవలెను:

అయితే, ఈ ఉప-పరిచ్ఛేదము క్రింద ఏదేని ఆదేశము ఇచ్చే ముందు ఆచరణ సాధ్యమైనంత వరకు తన అభిప్రాయమును తెలియజేసేందుకు ప్రాధికార సంస్థకు అవకాశమునీయవలెను.

(2) ఒక ప్రశ్న విధానపరమైనదా లేక విధానపరమైనది కాదా అనే విషయములో కేంద్ర ప్రభుత్వము యొక్క నిర్ణయము అంతిమమైనదై ఉండును.

(3) కేంద్ర ప్రభుత్వము, 11వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (2) యొక్క ఖండముల క్రింద ఏవేని తన కృత్యములను నిర్వర్తించుటకు సంబంధించి ప్రాధికార సంస్థకు ఆయాసమయములందు ఆదేశములను జారీచేయవచ్చును మరియు అట్టి ఆదేశములను పాటించుటకు అది బద్ధమై ఉండవలెను.

నియమములు చేయుటకు అధికారము.

34.(1) కేంద్ర ప్రభుత్వము, ఈ చట్టపు నిబంధనలను అమలుపరచుటకై అధికారిక రాజపత్రములో అధిసూచన ద్వారా నియమములు చేయవచ్చును.

(2) ప్రత్యేకించియు, పైన చెప్పిన అధికారము యొక్క వ్యాపకతకు భంగము కలుగకుండా అట్టి నియమములు ఈ క్రింద విషయాలన్నింటిని గురించి నిబంధనలు చేయవచ్చును--

(ఎ) 5వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (2) క్రింద ప్రాధికార సంస్థ యొక్క సభ్యుల ఇతర సేవా షరతులు;

(బి) 5వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (3) క్రింద ఎవరేని సభ్యుడు తన పదవికి రాజీనామా చేయుటకుగాను అతనిచే ఇవ్వబడునట్టి నోటీసు యొక్క కాలావధి;

(సి) 21వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (3) యొక్క ఖండము (బి) క్రింద ప్రాధికార సంస్థ నిధులను పెట్టుబడిగా పెట్టుకొనే రీతి;

(డి) 25వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (1) క్రింద ప్రాధికార సంస్థ లెక్కల వార్షిక వివరణను తయారుచేయవలసిన ప్రరూపము;

(ఇ) 26వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (1) క్రింద ప్రాధికార సంస్థచే తన కార్యకలాపముల వివరణలను పొందుపరచు నివేదికను తయారుచేసి మరియు కేంద్ర ప్రభుత్వమునకు సమర్పించు ప్రరూపము; మరియు

(ఎఫ్) విహితపరచవలసిన లేదా విహితపరచబడదగు ఏదేని ఇతర విషయము.

వినియమములు చేయుటకు అధికారము.

35.(1) ప్రాధికార సంస్థ ఈ చట్టము యొక్క నిబంధనలను అమలుపరచు ప్రయోజనము నిమిత్తము, ఈ చట్టమునకు మరియు దానిక్రింద చేయబడిన నియమములకు అసంగతము కాకుండా కేంద్ర ప్రభుత్వము యొక్క పూర్వ ఆమోదముతో, వినియమములు చేయవచ్చును.

(2) పైన పేర్కొనబడిన అధికారము యొక్క వ్యాపకతకు భంగము కలుగకుండా, ఈ క్రింది విషయముల కొరకు వినియమములను చేయవచ్చును--

(ఎ) 8వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (1) క్రింద ప్రాధికార సంస్థ సమావేశముల యొక్క సమయము మరియు ప్రదేశములు మరియు అట్టి సమావేశములందు అవసరం కాగల కోరమ్ తోసహా కార్యకలాప నిర్వహణ కొరకు అనుసరించ వలసిన ప్రక్రియ;

(బి) 10వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (2) క్రింద ప్రాధికార సంస్థచే నియమించబడు అధికారులు మరియు ఇతర ఉద్యోగుల సేవా షరతులు మరియు పారితోషికము;

(సి) ఉప-పరిచ్ఛేదము (1) క్రింద ప్రాధికార సంస్థ యొక్క సామాన్య మొహరుతో ముద్రవేయబడవలసి ఉండు కాంట్రాక్టులు మరియు 8వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (2) క్రింద ప్రాధికార సంస్థచే చేయబడు కాంట్రాక్టుల ప్రరూపము మరియు రీతి;

(డి) 19వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (1) క్రింద ప్రాధికార సంస్థచే వసూలు చేయబడవలసిన ఫీజులు మరియు అద్దె;

(ఇ) పోగొట్టుకొనిన ఆస్తి అభిరక్ష మరియు పునరుద్ధరణ మరియు 31వ పరిచ్ఛేదము క్రింద పోగొట్టుకొన్న ఆస్తికి హక్కుదారులైన వ్యక్తులకు తిరిగి ఇచ్చివేయుటకు అవసరమైన నిబంధనలు మరియు షరతులు.

పార్లమెంటు సమక్షములో ఉంచబడు నియమములు, వినియమములు మరియు, అధిసూచనలు.

36. ఈ చట్టము క్రింద చేయబడిన ప్రతి నియమము మరియు ప్రతి వినియమము లేదా జారీచేయబడిన ప్రతి అధిసూచనను దానిని చేసిన వెంటనే వీలైనంత త్వరగా పార్లమెంటు అధివేశనములోనున్నప్పుడు మొత్తము ముప్పది దినముల కాలావధిపాటు దాని ప్రతియొక సదనము సమక్షమున ఉంచవలెను, అట్టి కాలావధి ఒకే అధివేశనములోగాని వరుసగా వచ్చు రెండు లేక అంతకంటే ఎక్కువ అధివేశనములలోగాని చేరియుండ వచ్చును. పైన చెప్పినట్టి అధివేశనమునకు, లేక వరుసగా వచ్చు అధివేశనములకు వెనువెంటనే వచ్చు అధివేశనము ముగియుటకు పూర్వము ఉభయసదనములు ఆ నియమము, వినియమము లేదా సందర్భానుసారము అధిసూచనలో ఏదేని మార్పు

చేయుటకు అంగీకరించినచో లేక ఉభయ సదనములు ఆ నియమము, వినియమము లేదా సందర్భానుసారము అధిసూచన జారీచేయబడరాదని అంగీకరించినచో అటు పిమ్మట ఆ నియమము, వినియమము లేదా సందర్భానుసారము అధిసూచన అట్లు మార్పు చేయబడిన రూపములో మాత్రమే ప్రభావము కలిగివుండును లేక సందర్భానుసారముగ ఎట్టి ప్రభావమును కలిగియుండరాదు, అయినప్పటికినీ అట్టి ఏదేని మార్పుగాని లేదా రద్దుగాని అంతకు పూర్వము ఆ నియమము, వినియమము లేదా సందర్భానుసారము అధిసూచన క్రింద చేసియుండిన దేని శాసన మాన్యతకైనను భంగము కలిగించదు.

చిక్కులను తొలగించుటకు అధికారము.

37.(1) ఈ చట్టము యొక్క నిబంధనలను అమలుచేయుటలో ఏదేని చిక్కు ఏర్పడినచో, కేంద్ర ప్రభుత్వము అధికారిక రాజపత్రములో సాధారణ లేక ప్రత్యేక ఉత్తర్వును ప్రచురించుట ద్వారా ఆ చిక్కును తొలగించుటకు ఆవశ్యకము లేక ఉపయుక్తమని భావించినట్లుగా ఈ చట్టపు ప్రయోజనములకు అసంగతముగా లేనట్టి నిబంధనలను చేయవచ్చును:

అయితే, ఈ చట్టము ప్రారంభమైన తేదీ నుండి రెండు సంవత్సరముల కాలావధి ముగిసిన తరువాత అట్టి ఉత్తరువు ఏదియు చేయబడరాదు.

(2) ఈ పరిచ్ఛేదము క్రింద చేసిన ప్రతి ఉత్తర్వును దానిని చేసిన పిమ్మట వీలైనంత త్వరగా పార్లమెంటు యొక్క ప్రతియొక సదనము సమక్షమున ఉంచవలెను.